జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM
ఆదివారం
19-07-2026
సంపుటి 1 సంచిక 236
పేజీలు : 04
వెల : 1/-
PRGI No : TGTEL/25/A4195




ఉప్పు-జాజూతో

# నకిలీ ఎరువులు

## దందా గుట్టురట్టు చేసిన అధికారులు

**నల్గొండలో వెలుగుచూసిన అక్రమాలకు రంగారెడ్డి పెద్దఅంబర్‌పేటతో లింక్**

**రూ.1.5 కోట్ల విలువైన నకిలీ ఎరువులు, యంత్రాలు సీజ్ - పోలీసులతో కలిసి వ్యవసాయ శాఖ సంయుక్త దాడులు**

**మోదీ ఫొటోతో ప్రభుత్వ ఎరువుల్లా ప్యాకింగ్**

**రూ.1.5 కోట్ల విలువైన ఎరువులు, యంత్రాలు, ప్యాకింగ్ సామగ్రి స్వాధీనం**


**సుమారు 10 వేల బస్తాల నిల్వపై అధికారుల అంచనా**

**అసలు సూత్రధారుల కోసం దర్యాప్తు కొనసాగింపు**



**దశ, రంగారెడ్డి ప్రతినిధి:** రాష్ట్రంలో రైతులను లక్ష్యంగా చేసుకుని సాగుతున్న నకిలీ ఎరువుల మాఫియా దందా సంచలనంగా బయటపడింది. నల్గొండ జిల్లా మఠంపల్లి మండలం రఘునాథపాలెంలో ప్రారంభమైన విచారణ హైదరాబాద్ రంగారెడ్డి జిల్లా పెద్దఅంబర్‌పేట వరకు చేరుకోవడంతో భారీ అక్రమ నెట్‌వర్క్ వెలుగులోకి వచ్చింది. ఉప్పు, జాజూ వంటి పదార్థాలకు రంగులు కలిపి ప్రముఖ కంపెనీల పేర్లతో నకిలీ డీఏపీ (DAP) ఎరువులుగా తయారు చేసి రైతులకు విక్రయిస్తున్న ముఠాను పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారంలో సుమారు రూ.1.5 కోట్ల విలువైన నకిలీ ఎరువులు, తయారీ యంత్రాలు, ప్యాకింగ్ సామగ్రి, నకిలీ లేబుళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారం రైతు అప్రమత్తతతో వెలుగులోకి వచ్చింది. రఘునాథపాలెంలో కొనుగోలు చేసిన ఎరువులపై అనుమానం వ్యక్తం చేసిన రైతు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. హుజూర్‌నగర్ సీఐ జి. చరమంద రాజు ఆధ్వర్యంలో పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి నకిలీ ఎరువుల విక్రయ కేంద్రాన్ని తనిఖీ చేశారు. విచారణలో దుకాణదారుడు ఇచ్చిన సమాచారంతో పెద్దఅంబర్‌పేటలోని హరితహారం కాలనీలో నడుస్తున్న అక్రమ తయారీ కేంద్రాన్ని గుర్తించారు. మఠంపల్లి ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తన బృందంతో అక్కడికి చేరుకుని ఒక కోళ్ల ఫారంలో గత రెండు నెలలుగా

..మిగతా 4వ పేజీలో →



# 'మిషన్ ఆగమన్' విజయవంతం

**దేశంలోనే తొలి ప్రైవేట్ ఆర్బిటాల్ రాకెట్ 'విక్రమ్-1'**

**దశ, శ్రీహరికోట:** 'మిషన్ ఆగమన్' ద్వారా భారత అంతరిక్ష రంగంలో మరో చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ప్రైవేటు సంస్థ అయిన ప్రముఖ స్పేస్ టెక్ స్టార్టప్ స్కైరూట్ ఏరోస్పేస్ అభివృద్ధి చేసిన భారతదేశపు తొలి ప్రైవేట్ ఆర్బిటాల్ క్లాస్ రాకెట్ 'విక్రమ్ 1'ను శనివారం ఉదయం 11.30 గం.లకు తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రంలోని(షార్) ఒకటో ప్రయోగ వేదిక నుంచి నింగిలోకి పంపారు. మిషన్ ఆగమన్ పేరిట చేపట్టిన తొలి ప్రైవేట్ ఆర్బిటాల్ రాకెట్ ప్రయోగ కార్యక్రమాన్ని షార్ లోని ఇస్రో లాంచ్ వ్యూ గ్యాలరీ నుంచి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కుమారుడు దేవాన్ష్ తో కలిసి వీక్షించారు. దేశంలోనే తొలి ప్రైవేట్ రాకెట్ గా ఆర్బిటాల్ విక్రమ్ 1ను

..మిగతా 4వ పేజీలో →



# కల్తీకి కఠిన చట్టం

**ఆహార, ఔషధాల్లో కల్తీల నిరోధానికి కఠిన చట్టం రూపొందించాలి**

**విజిల్ బ్లోయర్ వ్యవస్థను, టోల్ ఫ్రీ నంబర్ను ఏర్పాటు చేయాలి**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష**

**దశ, హైదరాబాద్:** హార, ఔషధాల్లో కల్తీల నిరోధానికి కఠిన చట్టం రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నిత్యావసరాలు, కూరగాయలు, పండ్లు, పాలు అన్నీ కల్తీ అవుతుండటంతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని ముఖ్యమంత్రి గారు పేర్కొన్నారు. తెలంగాణ ఆహార కల్తీ, ఔషధ నియంత్రణ చట్టం (TGFADCA) పై ఎంసీహెచ్ఆర్డీ బోధి పెవిలియన్లో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు.

ఆకుకూరలు, కూరగాయలు, పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉంచేందుకు, పండ్లు త్వరగా మగ్గేందుకు విచ్చలవిడిగా రసాయనాలు వినియోగిస్తుండటంతో ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడుతోందని ముఖ్యమంత్రి తెలిపారు. ఎరువులు , పురుగు మందుల అధిక వినియోగంతో పంట ఉత్పత్తుల్లో రసాయన అవశేషాలు బయట పడుతున్నాయని, దీంతో కొన్ని దేశాలు దిగుమతులకు నిరాకరిస్తున్న విషయాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. మార్కెట్లో సేంద్రియ ఉత్పత్తుల పేరుతో పలు రకాల ఉత్పత్తులు విక్రయిస్తున్నారని, అధిక ధరలు చెల్లించి ప్రజలు వాటిని కొనుగోలు చేస్తున్నప్పటికీ అవి నిజంగా సేంద్రియ ఉత్పత్తులేనా అనే విషయాన్ని నిర్ధారించేందుకు సరైన వ్యవస్థలు లేవని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.కల్తీల నిరోధానికి సమగ్ర చట్టాలు అమలులో ఉన్న దేశాలను సందర్శించి అక్కడి విధానాలను అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఆయా అధ్యయనాల ఆధారంగా సమగ్ర నివేదికను రూపొందించాలని ఆదేశించారు. ఆ నివేదిక ఆధారంగా బిల్లును రూపొందించి శాసనసభలో సమగ్ర చర్చ చేపడతామని ముఖ్యమంత్రి తెలిపారు. శాసనసభలో చర్చతో పాటు ప్రజల నుంచి అభిప్రాయాలు కూడా స్వీకరించాలని సూచించారు. కల్తీలకు సంబంధించి సమగ్ర సమాచారం సేకరించేందుకు విజిల్ బ్లోయర్ వ్యవస్థను, టోల్ ఫ్రీ నంబర్ను

..మిగతా 4వ పేజీలో →

# ఉద్యోగాల పేరుతో యువతను మోసం

**'70 వేల ఉద్యోగాలు భర్తీ చేశారని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా' – 'యువ సంగ్రామ' సభలో కేటీఆర్**



**దశ, హైదరాబాద్:** తెలంగాణలో ఉద్యోగాల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం యువతను మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికల హామీలను అమలు చేయకుండా ఉద్యోగ 'నోటిఫికేషన్ల' స్థానంలో 'లూటిఫికేషన్లు' చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్ శివారులోని సరూర్‌నగర్‌లో నిర్వహించిన 'యువ సంగ్రామ' సదస్సులో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ విడుదల చేసిన యూత్ డిక్లరేషన్‌లో 24 హామీలు ఇచ్చినా ఒక్కటీ అమలు కాలేదని కేటీఆర్ ఆరోపించారు. అశోక్‌నగర్‌లో కాంగ్రెస్ అగ్రనేతలు మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను పూర్తిగా విస్మరించారని విమర్శించారు. ఉద్యోగాల క్యాలెండర్ అమలు చేయకుండా యువతను మోసం చేశారని ఆరోపించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని చెబుతోందని, అది నిజమైతే అందుకు సంబంధించిన నోటిఫికేషన్లతో సహా ఆధారాలు చూపించాలని కేటీఆర్ సవాల్ విసిరారు. ప్రభుత్వం తమ వాదనను నిరూపిస్తే తాను శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుని రాహుల్ గాంధీకి జై కొడతానని ప్రకటించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జారీ చేసిన నోటిఫికేషన్లకే ఇప్పుడు నియామక పత్రాలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం క్రెడిట్ తీసుకుంటోందని ఆరోపించారు. యువత ఆకాంక్షలను అర్థం చేసుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేటీఆర్ అన్నారు. ఉద్యోగాల కోసం ప్రశ్నిస్తున్న నిరుద్యోగులపై కేసులు నమోదు చేయడం, పోలీసులతో అణచివేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మండిపడ్డారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతతో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాన్ని రాష్ట్ర ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజలకు మేలు జరగలేదని, కాంగ్రెస్ నాయకులు, వారి అనుచరులకే ప్రయోజనం చేకూరిందని ఆరోపించారు. భూములు, ఇసుక అక్రమాలు పెరిగాయని, ప్రజలు ఎన్నికల హామీల గురించి ప్రశ్నిస్తే వారిపైనే కేసులు పెడుతున్నారని విమర్శించారు. యువత ఆవేదనను కాంగ్రెస్ ప్రభుత్వం తక్కువ అంచనా

..మిగతా 4వ పేజీలో →



# బండి, ఈటెల మధ్య సయోధ్య

**రంగంలోకి దిగిన అధిష్టానం**

**దశ, హైదరబాద్:** తెలంగాణలో అధికారంలోకి రావాలని చాలా కృతనిశ్చయంతో ఉన్న బీజేపీ దిద్దుబాటు చర్యలకు దిగింది. ఇప్పటికే వేరే పార్టీల నుంచి నేతలను ఆహ్వానించాలని చెప్పిన హైకమాండ్, నేతల మధ్య విభేదాలపై దృష్టి పెట్టింది. ముఖ్యంగా సీనియర్ నేతలు ఎవరికి వారుగా ఉంటున్న తీరుపై అసహనంతో ఉంది. అందుకే వారిని ఒక తాటిపైకి తీసుకురావాలని ప్లాన్ చేస్తోంది. ముఖ్యంగా బీసీ వర్గానికి చెందిన ఈటల రాజేందర్, బండి సంజయ్ మధ్య నెలకొన్న వివాదాలను పరిష్కరించాలని చూస్తోంది. అందుకు పార్టీ దూగా ఉన్న అభయ్ పాటిల్ జోక్యం చేసుకున్నారు. ఇద్దరి నేతలతో మీటింగ్ ఏర్పాటు చేసినట్టు సమాచారం. దీనికి సీనియర్ నేత, ఎంపీ లక్ష్మణ్ నివాసం వేదిక అయ్యిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణలో అధికారంలోకి రావాలని టార్గెట్ ఫిక్స్ చేసుకున్న బీజేపీ ఆ దిశగానే వ్యూహాలను రచిస్తోంది. అందులో భాగంగా ముందు పార్టీని దారిలో పెట్టాలని చూస్తోంది. అందులో భాగంగానే రాష్ట్ర పార్టీ పరిస్థితిపై ఎప్పటికప్పుడు నివేదికలు అడుగుతోంది. క్షేత్రస్థాయిలో పార్టీ బలాలు, బలహీనతలపై స్టడీ చేస్తోంది. ఈ రిపోర్టుల్లో నేతల మధ్య కోఆర్డినేషన్ లేదని తేలింది. అసలు ఒకరిద్దరు నేతల మధ్య సఖ్యత లేదని, తారాస్థాయిలో విభేదాలు ఉన్నట్టు వెల్లడైంది. క్షేత్రస్థాయి నుంచి వచ్చిన రిపోర్టులను పరిశీలించిన అనంతరం ముందుగా పార్టీ నేతలను దారిలోకి తీసుకురావాలని చూస్తోంది.ముఖ్యంగా ఈటల రాజేంద్ర, బండి సంజయ్ మధ్య ఉన్న విభేదాలు పార్టీకి చాలా ఇబ్బందిగా మారుతున్నాయని తెలుసుకుంది. ముందు వారిద్దరితోనే పార్టీ ప్రక్షాళన మొదలుపెట్టాలని చూస్తోంది. దీని కోసం పార్టీ దూతగా అభయ్ పాటిల్‌ను ఢిల్లీ నుంచి పంపించారు. అభయ్‌పాటిల్ వచ్చీరాగానే

..మిగతా 4వ పేజీలో →

# విద్యాసంస్థల ఉన్నతే లక్ష్యం

**ప్రభుత్వ పాఠశాలలను దేశంలోనే అత్యుత్తమ విద్యాసంస్థలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం:**

**రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజహరుద్దీన్**

**దశ, రంగారెడ్డి:** రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను దేశంలోనే అత్యుత్తమ విద్యాసంస్థలుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ తెలిపారు. శనివారం రంగారెడ్డి జిల్లా మంచాల్ మండలం ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను మంత్రి సందర్శించి పాఠశాలలోని విద్యా, క్రీడా, మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ఆత్మీయంగా మమేకమై ప్లేగ్రౌండ్‌లో కాసేపు క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, విద్యార్థుల మధ్య ఉండటం ఎంతో ఆనందంగా ఉందని, ఆధునిక సౌకర్యాలతో కూడిన ఈ పాఠశాలను చూసి సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో ప్రభుత్వ పాఠశాలల్లో అత్యాధునిక విద్యా వాతావరణం, డిజిటల్ తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, విశాలమైన క్రీడా మైదానాలు, బాస్కెట్‌బాల్, వాలీబాల్, క్రికెట్ తదితర క్రీడా సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. తమ చిన్నతనంలో ఇలాంటి సౌకర్యాలు లేకపోయినా కష్టపడి చదివి ఎదిగామని, ప్రస్తుతం విద్యార్థులకు లభిస్తున్న అవకాశాలను పూర్తిగా సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విజయం సాధించాలంటే కష్టపడి పనిచేయడం, క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావం అవసరమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులను గౌరవించాలని, తల్లిదండ్రుల ఆశలు, త్యాగాలను గుర్తుంచుకోవాలని, ఓటమిని చూసి నిరాశ చెందకుండా నిరంతర సాధనతో

..మిగతా 4వ పేజీలో →



# నీట్ ర్యాంకర్లను అభినందించిన సీఎం

**దశ, హైదరాబాద్:** నీట్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థల ఆధ్వర్యంలోని గురుకుల పాఠశాలల విద్యార్థులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , ఉన్నతాధికారులతో కలిసి విద్యార్థులు ఎంసీఆర్హెచ్ఆర్డీ బోధి పెవిలియన్లో ముఖ్యమంత్రి ని మర్యాదపూర్వకంగా కలిశారు.





# ఉప్పు-జాజూతో నకిలీ ఎరువులు

**మొదటి పేజీ తరువాయి**

నకిలీ ఎరువుల తయారీ జరుగుతున్నట్లు గుర్తించారు. గోదాంలో భారీ యంత్రాలు, ప్యాకింగ్ సామగ్రి, ప్రముఖ ఎరువుల కంపెనీల పేర్లతో ముద్రించిన నకిలీ సంచులు, లేబుళ్లు, భారీ ఎత్తున నకిలీ ఎరువుల నిల్వలను గుర్తించారు. దర్యాప్తులో సాధారణ ఉప్పు, జాజి వంటి పదార్థాలకు రంగు కలిపి డీఏపీతో పాటు ఇతర బ్రాండెడ్ ఎరువులుగా తయారు చేస్తున్నట్లు అధికారులు నిర్ధారించారు. రైతులను మోసం చేసేందుకు ప్రముఖ కంపెనీల పేర్లతో పాటు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫొటోతో ప్రభుత్వ సబ్సిడీ ఎరువుల మాదిరిగా ప్యాకింగ్ చేసినట్లు కూడా గుర్తించారు. గోదాంను పరిశీలించిన అధికారులు అక్కడ ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే తయారీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు తేల్చారు. సుమారు 10 వేల నకిలీ ఎరువుల బస్తాలు నిల్వ ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. గోదాంను పూర్తిగా సీజ్ చేసి, స్వాధీనం చేసుకున్న నకిలీ ఎరువులు, యంత్రాలు, ప్యాకింగ్ సామగ్రిని వ్యవసాయ శాఖ ఆధీనంలోకి తీసుకున్నారు. ఈ సంయుక్త దాడుల్లో పోలీసు అధికారులతో పాటు రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి సుజాత, అబ్దుల్లాపూర్‌మెట్ వ్యవసాయ అధికారి పల్లవి, మఠంపల్లి వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌తో పాటు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. అధికారులు గోదాంను సీజ్ చేసి తదుపరి విచారణ కోసం ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు ప్రస్తుతం ఈ నకిలీ ఎరువుల ముఠా వెనుక ఉన్న అసలు సూత్రధారులు, సరఫరా నెట్‌వర్క్, ఇతర జిల్లాలతో ఉన్న సంబంధాలపై లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి అక్రమాలపై ప్రత్యేక దాడులు నిర్వహించాలని రైతు సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.

### రైతులకు అధికారులు సూచనలు.

అధికారిక లైసెన్స్ ఉన్న దుకాణాల నుంచే ఎరువులు కొనుగోలు చేయాలి.
బిల్ తప్పనిసరిగా తీసుకోవాలి.
ప్యాకెట్‌పై తయారీదారు, బ్యాచ్ నంబర్, హోలోగ్రామ్ పరిశీలించాలి.
అనుమానం వస్తే వెంటనే వ్యవసాయ శాఖ లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలి.




# బండి-ఈటెల సయోధ్య

**మొదటి పేజీ తరువాయి**



సంజయ్, ఈటలతో భేటీ రిపారు. సీనియర్ నేత, ఎంపీ లక్ష్మణ్ నివాసంలో ఈ సీక్రెట్ సమావేశం జరిగింది. ఇద్దరి నేతలు వారి వారి సమస్యలను ఆయన ముందు ఉంచారు. పార్టీలో చేరినప్పటి నుంచి ఒకరంటే ఒకరికి పడటం లేదని తేలింది. ఒకరిపై ఒకరు సీరియస్ ఫిర్యాదులు చేసుకున్నారు. దీనిపై అధిష్ఠానంతో మాట్లాడతాని ప్రస్తుతానికి కోఆర్డినేషన్‌తో కార్యక్రమాల్లో పాల్గొనాలని ఇరువురి నేతలకు అభయ్ హైకమాండ్ మాటగా చెప్పినట్టు తెలుస్తోంది. ఈ సమావేశం జరిగిన తర్వాత ఎంపీ లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనతో విసిగిపోయారని అన్నారు. తెలంగాణలో అధికారంలోకి రావడానికి అనుసరించాల్సిన వ్యూహాలపై మాట్లాడామని అన్నారు. నేతల మధ్య ఎలాంటి విభేదాలు లేవని వాటికి చెక్ చెప్పడానికే మీడియా ముందుకు వచ్చామని తెలిపారు. ఒక కుటుంబ పార్టీగా తాము మాట్లాడుకున్నామని అన్నారు. బీజేపీ అధికారంలోకి రావడానికే అంతా కలిసి కట్టుగా పని చేస్తామని తెలిపారు. తెలంగాణ మహిళా రిజర్వేషన్లు, సీట్ల సంఖ్య పెరుగుతుందని అన్నారు. తెలంగాణ జమిలీ ఎన్నికలే వస్తాయని లక్ష్మణ్ తెలిపారు. ఈ మీడియా సమావేశంలో ఈటల రాజేందర్, బండి సంజయ్ ఎంపీ లక్ష్మణ్ పక్కనే ఉన్నారు. అంతకంటే ముందు వారంతా ఒకరినొకరు ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్న వీడియోలు వైరల్ అవుతున్నాయి. వచ్చీరాగానే సంజయ్, ఈటలతో భేటీ రిపారు. సీనియర్ నేత, ఎంపీ లక్ష్మణ్ నివాసంలో ఈ సీక్రెట్ సమావేశం జరిగింది. ఇద్దరి నేతలు వారి వారి సమస్యలను ఆయన ముందు ఉంచారు. పార్టీలో చేరినప్పటి నుంచి ఒకరంటే ఒకరికి పడటం లేదని తేలింది. ఒకరిపై ఒకరు సీరియస్ ఫిర్యాదులు చేసుకున్నారు.

దీనిపై అధిష్ఠానంతో మాట్లాడతాని ప్రస్తుతానికి కోఆర్డినేషన్‌తో కార్యక్రమాల్లో పాల్గొనాలని ఇరువురి నేతలకు అభయ్ హైకమాండ్ మాటగా చెప్పినట్టు తెలుస్తోంది. ఈ సమావేశం జరిగిన తర్వాత ఎంపీ లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనతో విసిగిపోయారని అన్నారు. తెలంగాణలో అధికారంలోకి రావడానికి అనుసరించాల్సిన వ్యూహాలపై మాట్లాడామని అన్నారు. నేతల మధ్య ఎలాంటి విభేదాలు లేవని వాటికి చెక్ చెప్పడానికే మీడియా ముందుకు వచ్చామని తెలిపారు. ఒక కుటుంబ పార్టీగా తాము మాట్లాడుకున్నామని అన్నారు. బీజేపీ అధికారంలోకి రావడానికే అంతా కలిసి కట్టుగా పని చేస్తామని తెలిపారు. తెలంగాణ మహిళా రిజర్వేషన్లు, సీట్ల సంఖ్య పెరుగుతుందని అన్నారు. తెలంగాణ జమిలీ ఎన్నికలే వస్తాయని లక్ష్మణ్ తెలిపారు. ఈ మీడియా సమావేశంలో ఈటల రాజేందర్, బండి సంజయ్ ఎంపీ లక్ష్మణ్ పక్కనే ఉన్నారు. అంతకంటే ముందు వారంతా ఒకరినొకరు ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్న వీడియోలు వైరల్ అవుతున్నాయి.

# విద్యాసంస్థల ఉన్నతే లక్ష్యం

**మొదటి పేజీ తరువాయి**



ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలలో ఏర్పడే స్నేహాలు జీవితాంతం నిలుస్తాయని, పరస్పర గౌరవం, సహకారం, ముఖ్యంగా బాలికలను గౌరవించే సంస్కారాన్ని అలవర్చుకోవాలని అన్నారు. విజయం అనేది ఒక్కరోజులో రాదని, ఉన్నత స్థాయికి చేరుకున్న తర్వాత కూడా వినయాన్ని కోల్పోకుండా నిరాడంబరంగా ఉండటమే నిజమైన గొప్పతనమని పేర్కొన్నారు. ఈ పాఠశాల నుంచి భవిష్యత్తులో వైద్యులు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, క్రీడాకారులు, పరిపాలనా అధికారులు తయారై రాష్ట్రానికి, దేశానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. విద్యార్థులందరికీ ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం విద్యాభివృద్ధికి అనేక వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని బలోపేతం చేస్తూ డైట్ ఛార్జీల పెంపు, విద్యార్థులకు పోషకాహారాన్ని అందించడం వంటి చర్యలు చేపట్టిందన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధానం ద్వారా ప్రీప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే క్యాంపస్‌లో నాణ్యమైన విద్యను అందించేలా ఆధునిక మౌలిక వసతులతో కూడిన పాఠశాలలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు తమకు లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని కృతజ్ఞతాభావంతో చదువుకోవాలని సూచించారు. విజయం అంటే కేవలం పరీక్షల్లో మంచి మార్కులు సాధించడం మాత్రమే కాదని, ఎంచుకున్న ప్రతి రంగంలో అత్యున్నత స్థాయికి చేరుకోవాలనే లక్ష్యంతో శ్రమించాలని చెప్పారు. ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నిరంతర కృషితో ప్రతి విద్యార్థి రాష్ట్రానికి, దేశానికి గర్వకారణం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీఓ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి నవీన్ కుమార్ రెడ్డి, మంచాల్ తహశీల్దార్, ఆరుట్ల సర్పంచ్ శోభారాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరిధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ విద్యార్థి ఉద్యమకారులకు గుర్తింపులో తొలి ప్రాధాన్యం ఇవ్వాలి

## డిసెంబర్ 9ను 'విద్యార్థి విజయ దివాస్'గా ప్రకటించాలని డిమాండ్



**దశ ఓయూ :** తెలంగాణ విద్యార్థి ఉద్యమకారులకు గుర్తింపు ప్రక్రియలో తొలి ప్రాధాన్యం కల్పించాలని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ప్రాంగణంలో జరిగిన తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల సమావేశం ప్రభుత్వాన్ని కోరింది. తెలంగాణలోని వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థి ఉద్యమకారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా విద్యార్థి ఉద్యమ నేతలు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమకారుల కమిటీ ముందుగా విద్యార్థి ఉద్యమకారులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను తెలుసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొని కేసులు ఎదుర్కొని, జైలు జీవితాలు గడిపి, విద్యా, ఉద్యోగ అవకాశాలను కోల్పోయిన విద్యార్థి ఉద్యమకారులకు గుర్తింపు ప్రక్రియలో తొలి ప్రాధాన్యం ఇవ్వాలని కమిటీని కోరారు. అన్ని విశ్వవిద్యాలయాల విద్యార్థి ఉద్యమకారులతో సమన్వయ కమిటీ ఏర్పాటు చేసి, త్వరలోనే కే. కేశవరావు కమిటీతో పాటు రాష్ట్ర మంత్రులు, ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో భవిష్యత్ కార్యాచరణను కూడా ప్రకటించారు. అన్ని విశ్వవిద్యాలయాల్లో విలేకరుల సమావేశాలు, సదస్సులు నిర్వహించాలని, సెప్టెంబర్ 17న ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల వేదికగా బహిరంగ సభ నిర్వహించాలని, నవంబర్ 18న ఓయూ జేఏసీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించాలని నిర్ణయించారు. అలాగే డిసెంబర్ 9ను "తెలంగాణ విద్యార్థి విజయ దివాస్"గా ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 9లోపు విద్యార్థి జేఏసీ ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదించి అమలు చేయాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సమావేశంలో ఓయూ జేఏసీ, టీఎస్ జేఏసీ నాయకులు కోట శ్రీనివాస్ గౌడ్, మందాల భాస్కర్, ఆజాద్, కంచర్ల బద్రి, దుర్గం భాస్కర్, మోహన్ రాజ్, మున్నూరు రవి, దుర్గం సారయ్య, రవీందర్ నాయక్, బండారి వీరబాబు, దరువు ఎల్లన్న, డి. విజయ్, వెన్నెల, శ్వేత, కవిత, పార్వతి, జంజర్ల రమేష్, శ్రీధర్, జగన్, రంజిత్, హరీష్ గౌడ్‌తో పాటు వివిధ విశ్వవిద్యాలయాల జేఏసీ ప్రతినిధులు పాల్గొన్నారు.



# ఉద్యోగాల పేరుతో యువతను మోసం

**మొదటి పేజీ తరువాయి**

వేస్తోందని, ఆ అసంతృప్తి భవిష్యత్తులో రాజకీయ ఫలితాలపై ప్రభావం చూపుతుందని అన్నారు. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని, గతంలో జరిగిన తప్పులను పునరావృతం చేయబోమని చెప్పారు. నిరుద్యోగ యువతకు అండగా నిలుస్తామని, వారి సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ కట్టుబడి ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా నిరుద్యోగ యువతను ఉద్దేశించి కేటీఆర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు గుర్తు చేయాలని పిలుపునిచ్చారు. యువత ఆకాంక్షలను నెరవేర్చలేని ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.

# ఆర్పీఐ గ్రేటర్ ఉపాధ్యక్షుడిగా అరుణ్ కుమార్ నియామకం



**దశ ఓయూ :** కేంద్ర ప్రభుత్వం అందించే వివిధ సహాయ నిధులు అర్హులైన పేద ప్రజలందరికీ అందేలా రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా పూర్తి స్థాయిలో సహకరిస్తుందని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డిమల్ల శ్రీనివాస్ స్పష్టం చేశారు. శనివారం సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో ఆర్.పి.ఐ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్.పి.ఐ. గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షులుగా సికింద్రాబాద్ న్యూ బోయిగూడకు చెందిన కే.డి. అరుణ్ కుమార్ కు ఆయన నియామక పత్రాలను అందజేసి అభినందనలు తెలిపారు.

# కల్తీకి కఠిన చట్టం

**మొదటి పేజీ తరువాయి**

ఏర్పాటు చేయాలని అయన ఆదేశించారు. కల్తీల నిరోధానికి ముందుగా క్యూర్ రాంతాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. అక్కడ నిబంధనలను అమలు చేసి, వాటి అమలులో ఎదురయ్యే లోటుపాట్ల ఆధారంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు , రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ , ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు , ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీలు వి.శేషాద్రి , ఎన్.శ్రీధర్ , వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 'మిషన్ ఆగమన్' విజయవంతం

**మొదటి పేజీ తరువాయి**

అభివృద్ధి చేశారు. స్కైరూట్ అభివృద్ధి చేసిన ప్రొపల్షన్ సిస్టమ్స్, త్రీడీ ప్రింటెడ్ ఇంజన్లు, ఘన ఇంధన రాకెట్ బూస్టర్లు అమర్చారు. సుమారు 350 కిలోల బరువున్న నాలుగు చిన్న ఉపగ్రహాలను 450 కి.మీల ఎత్తులోని భూ నిమ్న కక్ష్యలోకి ప్రవేశపెట్టేలా విక్రమ్ 1ను డిజైన్ చేశారు. విక్రమ్ 1 ద్వారా గ్రహాస్పేస్, కాస్మోసర్వ్, డీక్యూబ్డ్ సంస్థలకు చెందిన టెక్నాలజీ డెమాన్‌స్ట్రేషన్ పేలోడ్లతో పాటు స్కైరూట్ కు చెందిన 'స్కోప్' ఉపగ్రహాలను రోదసిలోకి తీసుకెళ్లారు. వీటితో పాటు కాస్మోస్ డైమండ్స్ కు చెందిన కాస్మిక్ బ్లూమ్ అనే కళాకృతిని, మరో మైక్రోఆర్ట్ పీస్ ను పంపారు. అంతరిక్ష ప్రయోగాల్లో ఖర్చును తగ్గించడంతో పాటు ఉపగ్రహాలను వేగంగా కక్ష్యలోకి చేర్చేందుకు వీలుగా విక్రమ్ 1 రాకెట్ ను రూపొందించారు. భారత అంతరిక్ష రంగంలో ఒక చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. దేశీయ ప్రైవేట్ స్పేస్ సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్, పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన 'విక్రమ్ 1' ఆర్బిటాల్ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించింది. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి ఈ రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో వాణిజ్యపరంగా సొంతంగా ఆర్బిటాల్ రాకెట్లను అభివృద్ధి చేసి, ప్రయోగించిన అతికొన్ని దేశాల సరసన భారత్ నిలిచింది. 'మిషన్ ఆగమన్' పేరుతో చేపట్టిన ఈ ప్రయోగం భారత ప్రైవేట్ అంతరిక్ష పరిశ్రమ రాకను సూచిస్తుంది. తొలుత ఒక అంతర్గత సాంకేతిక సమస్య కారణంగా కొద్దిసేపు నిలిపివేసినా, ఆ తర్వాత రాకెట్ ప్రణాళిక ప్రకారమే నిప్పులు చిమ్ముతూ ఆకాశంలోకి దూసుకెళ్లింది. రాకెట్‌కు సంబంధించిన నాలుగు దశలు అనుకున్నట్టుగానే పనిచేయడమే కాకుండా ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టే ప్రక్రియ కూడా తొలి ప్రయత్నంలోనే విజయవంతమైంది. ఈ చారిత్రక విజయం స్కైరూట్ బృందంలో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

# మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి జన్మదిన వేడుకలు

**దశ ఓయూ:** హైదరాబాద్: మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ (BCSF) రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మనబోయిన సైదులు యాదవ్ ఆధ్వర్యంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శుక్రవారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రీన్ ఛాలెంజ్‌లో భాగంగా మొక్కలు నాటడంతో పాటు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి, తలసేమియా బాధితుల సహాయార్థం 50 మంది విద్యార్థులతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సైదులు యాదవ్, నల్గొండ అంజి మాట్లాడుతూ నల్గొండ జిల్లా అభివృద్ధికి జగదీశ్ రెడ్డి విశేష కృషి చేశారని కొనియాడారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న నాయకుడిగా ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన రాష్ట్ర నాయకుడు మట్ట రాజు యాదవ్, మునుగోడు నియోజకవర్గ బీఆర్ఎస్వీ అధ్యక్షుడు నలపరాజు రమేష్, సాయి కిరణ్, సురేందర్, పవన్, గణేష్, చింటూ రెడ్డి, ప్రభాకర్, ఓంకార్, నవీన్, రాఘవేంద్ర, శివ యాదవ్, సుధీర్, శంకర్, రవి, నరేష్, అంబేద్కర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com